క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రదీప్‌నాయుడు

నెల్లిమర్ల: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకల్లో భాగంగా నగర పంచాయతీ పరిధిలోని పేదలకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. నగరంలోని 17వ వార్డులో కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, మహేశ్వరి దంపతుల చేతుల మీదుగా 200 మంది పేదలకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కుమారుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్ కారుకొండ వెంకటకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంటా సతీష్, కౌన్సిలర్ మొయిద శ్రీనివాసరావు, నాయకులు పైల మురళీ, నౌపాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



పాలాస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

విజయనగరం: మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు నగరంలో వివిధ ప్రాంతాలలో బుధవారం పర్యటించారు. స్థానిక పాలాస్పత్రి భవనాన్ని పరిశీలించి, భవనానికి మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిస్థితిపై ఆరా తీశారు. అలాగే సామాజిక మరుగుదొడ్ల నిర్వాహకులతో మాట్లాడి, సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రజారోగ్య పర్యవేక్షకుడు బాలకృష్ణ, ఏఈ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని బుధవారం ఉదయం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు ఎ. జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మరణించిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బకాయిహెల్త్ అలవెన్సులు చెల్లించడంతో పాటు విలీనప్రాంత కార్మికులను కార్పొరేషన్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో కె. సురేష్, బి. భాస్కరరావు, డి. శ్రీను, ఎస్. పైడిరాజు, జి. రమ, బి. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వినాయక మంటపం



వినాయక మంటపం

విజయనగరం రూరల్: మండలంలోని ముడిదాంలో ఎన్‌హెచ్- 26 రహదారి పక్కన ఏర్పాటు చేసిన గణనాథుని మంటపం పలువురిని ఆకట్టుకుంటోంది. ప్రతి ఏటా ఇక్కడ అతిపెద్ద మంటపం ఏర్పాటు చేయడమే కాకుండా అతి పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకుడు సన్యాసప్పుడు తెలిపారు.

భక్తి గీతాలాపన

విజయనగరం టౌన్: శ్రీవారి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఫూల్‌బాగ్ జగదాంబ నగర్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన భక్తిగీతాలాపన ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.భీష్మారావు సారథ్యంలో వర్ధమాన గాయనీ, గాయకులు అన్నమాచార్య కీర్తనలు, సినీ భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు భీష్మారావును సత్కరించారు.

వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న మిమ్స్ వైద్య సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాంలో మిమ్స్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 150 మంది ఉచిత వైద్య శిబిరంలో చికిత్సలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు మందులు అందజేస్తూ, ఆరోగ్యపరమైన సలహాలు అందించారు. సర్పంచ్ పతివాడ అప్పన్న, పీఆర్‌ఓ రాజమహంతి ధనుంజయరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం



పూసపాటిరేగ-2 సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: సచివాలయాలతో గ్రామస్వరాజ్యం సిద్ధిస్తుందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పూసపాటిరేగ-2, గోవిందపురం సచివాలయ భవనాలు, గోవిందపురం ఆర్‌బీకే సెంటర్, భరిణికాం సీసీ రహదారి, చౌడువాడ, సీహెచ్ అగ్రహారం వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. ఎటువంటి అవినీతి జరగకూడదనే ఉద్దేశంతో లబ్ధిదారులకు బ్యాంక్ ఖాతాలకు సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఎలాంటి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. నాడు -నేడు నిధులతో పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏ సంక్షేమ పథకం అమలు కావాలన్నా జన్మభూమి కమిటీల సిఫార్సు అవసరమయ్యేదని.. ప్రస్తుతం ఎటువంటి సిఫార్సులు లేకుండానే పథకాలు మంజూరవుతున్నాయన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ఎన్నికల హామీలను 99 శాతం అమలు చేసినట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో తాజాగా మహిళా బిల్లు ప్రవేశపెట్టగా... ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండేళ్ల కిందట నుంచే రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని తెలిపారు. స్థానిక సంస్థలలో ఇప్పటికే 50 శాతం పైబడి రిజర్వేషన్లను మహిళలు పొందారని చెప్పారు. 2024 ఎన్నికలలో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, వైస్ ఎంపీపీలు ఎన్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, వైస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, వైస్సార్‌సీపీ నాయకులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, మహంతి లక్ష్మణరావు, దాడిశెట్టి త్రినాథరావు, పిన్నింటి ఎల్లంనాయుడు, ఎంకే మోహన్, టొంపల సీతారాం, కొత్తకోట శ్రీరాములు, మొగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, పట్టెపు శ్రీనివాసరావు, బాలా అప్పలరాజు, బూర చిన్నారెడ్డి, బాలా రామలక్ష్మి, పట్టెపు శివరాజ్యలక్ష్మి, మొంగం మంగమ్మ, వాసుపల్లి అప్పన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణాపురంలో బల్క్‌మిల్క్ సెంటరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

మిల్క్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి..

బల్క్‌మిల్క్ సెంటరును పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో ప్రభుత్వం నిర్మించిన బల్క్‌మిల్క్ సెంటర్‌ను ఎమ్మెల్యే బడ్డుకొండ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి మిల్క్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రైవేట్ డెయిరీల వల్ల పాడి రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, అందుకే ప్రభుత్వమే డెయిరీ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, ఎంపీడీఓ ఎం. రాధిక, గ్రామ ప్రజాప్రతినిధులు మొంగం నాగబాబు, కొయ్య ఎల్లన్నరెడ్డి, మొంగం మంగమ్మ, కొయ్య సన్యాసమ్మ, కొయ్య రామస్వామి, సన్యాసిరావు, బంగారప్పడు, తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధే ధ్యేయం



32వ డివిజన్ తోటపాలెంలో నూతన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మేయర్, స్థానిక కార్పొరేటర్లు

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
• 9, 32 డివిజన్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభం

విజయనగరం: అన్ని రంగాల్లో విజయనగరం నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 9, 32 డివిజన్‌లలో రూ.36 లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్డి గురుమూర్తి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు భోగాపురపు రవిచంద్ర మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు 32వ డివిజన్ పరిధిలో రూ.3 కోట్లతో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా కోలగట్ల వీరభద్రస్వామి హయాంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగడం అభినందనీయమన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవశ్యకత అందరిపై ఉందన్నారు. అంతకుముందు కోలగట్ల రెండు డివిజన్ల పరిధిలో పర్యటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, 9వ డివిజన్ కార్పొరేటర్‌లో సయ్యద్ గౌస్, పిలకా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో దోబిఖానా నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం శంకుస్థాపన చేశారు. పది లక్షల రూపాయలతో దోబిఖానా నిర్మించనున్నట్లు కోలగట్ల తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, రజక వృత్తిదారుల కోరిక మేరకు దోబిఖానా ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చూపిన చొరవ అభినందనీయమన్నారు. నగరంలో అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడమే కాకుండా ప్రారంభోత్సవాలు కూడా చేస్తున్నారన్నారు. రజక వృత్తిదారుల సంఘ నాయకులు మాట్లాడుతూ, తమ అభ్యర్థన మేరకు దోబిఖానా ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. అడిగిన వెంటనే దోబిఖానా ఏర్పాటుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవ చూపడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, స్థానిక కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, తోనంగి జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



దోబిఖానా నిర్మాణానికి శంకుస్థాపన

రేపు, ఎల్లుండి క్రీడా పోటీలు

విజయనగరం: స్కూల్ గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 22,23 తేదీల్లో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల మండల, పట్టణ స్థాయిల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు ఎంపిక పోటీలకు అర్హులన్నారు. 22న ఎనిమిది క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనుండగా... 23న అథ్లెటిక్స్ క్రీడాంశంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.

వైఎస్సార్ చేయూత సొమ్మును సద్వినియోగం చేసుకోండి...

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ చేయూత సొమ్మును మహిళలు సద్వినియోగపరుచుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు సూచించారు. మండలంలోని కొండవెలగాడలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం వైఎస్సార్ చేయూత పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హత గల మహిళలందరికీ పథకాన్ని వర్తింపజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏరియా కో ఆర్డినేటర్ బంగారమ్మ, ఏపీఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో చోరీ

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని జాతీయరహదారి సమీపంలో ఉన్న శ్మశానంలో దహన సంస్కారాలు చేసే బల్లను దుండగలు ఎత్తుకుపోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళ్తే.. పూసపాటిరేగ కోనేరు సమీపంలో గల శ్మశానవాటికకు ఓ మహిళ మృతదేహాన్ని దహనసంస్కాలకు బుధవారం తీసుకువెళ్లారు. అక్కడ దహన సంస్కారాలు చేసే బల్ల లేకపోవడంతో వెంటనే గ్రామ పెద్దలకు తెలియజేశారు. సుమారు రూ.1.60 లక్షల విలువైన బల్ల లేకపోవడంతో గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

పక్కాగా కుటుంబ వివరాలు

• కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు ఆదేశించారు. నగరంలో ప్రారంభమైన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మరింత సమర్థవంతంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి, వైద్యాధికారులకు సూచించారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను మరింత వేగవంతం చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో 20 రోజుల్లోగా మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలన్నారు. భవిష్యత్‌లో ఇవే వివరాల ఆధారంగా వైద్య చికిత్సలుంటాయి కాబట్టి.. సర్వే పక్కాగా చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

రేపు నెల్లిమర్లలో 'జగనన్నకు చెబుదాం'

నెల్లిమర్ల: కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాల మేర కు నెల్లిమర్లలో గురువారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి. రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండలానికి చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

నెల్లిమర్ల రూరల్: కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరగనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలు తమ సమస్యలపై జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా.. మండల కేంద్రంలోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని.. ప్రజలు తమ సమస్యలను వినతిరూపంలో అందజేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అంబళ్ల సుధారాణి

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్నట్లు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు తెలిపారు. జమ్మునారాయణపురం వద్దనున్న చలపతి స్కూల్లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, అగ్ని ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంభవించిన తర్వాత తీసుకోవాల్సిన నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు ఉమామహేశ్వరరావు, ఎస్.రామారావు, పి.మురళి, ఆర్.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంట నమోదుతో ఎన్నో ప్రయోజనాలు



సింగవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిర్మల

• ఏఓ పూడి నిర్మల

డెంకాడ: పంట నమోదుతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పంట నమోదుతో బీమా వర్తిస్తుందని చెప్పారు. ప్రభుత్వ మద్దతు ధరతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సింగవరం, నాతవలస గ్రామాల పెద్దలు పిట్టా అప్పారావు, లెంక అప్పలనాయుడు, బమ్మిడి రమణ, అప్పలస్వామినాయుడు, గురునాథరావు, ఏఈఓ రామకోటి, ప్రకృతి వ్యవసాయ క్లస్టర్ ఇన్‌చార్జ్ సుజాత, రైతులు పాల్గొన్నారు.

అదుపులో డయేరియా..

• గ్రామాల్లో వైద్యశిబిరాలు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ, గుణుపూరు గ్రామాల్లో విజృంభించిన డయేరియా అదుపులోకి వచ్చింది. వైద్య సిబ్బంది రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. వ్యాధిని నివారించేందుకు డెంకాడ పీహెచ్‌సీ డాక్టర్ పావని ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది రెండు గ్రామాల్లో సేవలందిస్తున్నారు. దీంతో పాటు డెంకాడ పీహెచ్‌సీలో కూడా రోగులకు వైద్య సేవలందుతున్నాయి. పినతాడివాడ, గుణుపూరు గ్రామాల్లో బుధవారం ఇంటింటి సర్వే నిర్వహించి డయేరియాతో బాధపడుతున్న ముగ్గురిని గుర్తించి, శిబిరానికి తీసుకువచ్చి చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ, ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. చేపలు, మాంసం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇదిలా ఉంటే సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులు పినతాడివాడలో క్లోరినేటెడ్ వాటర్ అందిస్తున్నారు.



పినతాడివాడలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పావని, సిబ్బంది

ఈ నెలాఖరు నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



బైరెడ్డిపాలెంలో జగనన్న సురక్ష సర్వేలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

• తహసీల్దార్ చింతాడ బంగార్రాజు

భోగాపురం: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమై అక్టోబర్ 31 వరకు జరగనున్నాయని తహసీల్దార్ చింతాడ బంగార్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈనెల 30న బైరెడ్డిపాలెం, అక్టోబర్ 3న ముక్కాం, 5న చేపలకంచేరు, 6న రామచంద్రపేట, 9న భోగాపురం, 10న అమటాం రావివలస, 12న కవులవాడ, 13న గుడివాడ, 16న రాజాపులోవ, 17న చెరుకుపల్లి, 19న రావాడ, 20న ముంజేరు, 26న భోగాపురం-2, 27న గూడెపువలస, 31న సవరవిల్లిలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఈఓపీఆర్‌డీ సురేష్, ఏపీఎం రమణ.. ఎంపీడీఓ ఆధ్వర్యంలో హెచ్‌డీటీ ఎస్ శ్రీనివారావు, ఏపీఓ ఆదిబాబు రెండు టీమ్‌లుగా ఏర్పడి పీహెచ్‌సీ వైద్యాధికారులతో కలిసి గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

బైరెడ్డిపాలెంలో డోర్ టూ డోర్ సర్వే

బైరెడ్డిపాలెంలో తహసీల్దార్ బంగార్రాజు ఆధ్వర్యంలో పలువురు అధికారులు, వైద్య సిబ్బంది బుధవారం డోర్ టు డోర్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

వంతెనపై వెలగని దీపాలు

భోగాపురం: మండలంలోని జాతీయ రహదారి వంతెనలపై ప్రధాన కూడళ్ల వద్ద నేషనల్ హైవే సిబ్బంది ఏర్పాటు చేసిన దీపాలు పూర్తి స్థాయిలో వెలగడం లేదు. దీంతో జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. భోగాపురం, అక్కివరం, సుందరపేట ప్రధాన కూడళ్ల వద్ద అలాగే సవరవల్లి, అమనాం, పోలిపల్లి, రాజాపులోవ ఫ్లై ఓవర్ వంతెనల వద్ద తరచూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఈ సమస్యపై సీఐ వెంకటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా, సంబంధిత సిబ్బందితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



భోగాపురం జాతీయ రహదారి వంతెనపై వెలగని దీపాలు

మహిళా బిల్లుపై హర్షం



విజయనగరం టౌన్: కోట వద్ద నారీశక్తివందన బిల్లుపై హర్షం వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశ పెడుతున్నందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రతినిధి గదుల సత్యలత బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం బిల్లు ఆమోదం లేకుండానే మహిళలకు ప్రతి విషయంలో రిజర్వేషన్ కల్పించడం గొప్పవరమని పేర్కొన్నారు. నామినేటెడ్, ఎలెక్టెడ్ పోస్టుల భర్తీలో మహిళలకు పెద్దపీట వేశారని తెలిపారు.

కృతజ్ఞతలు..

పూసపాటిరేగ: మహిళలకు పెద్దపీట వేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎంపీపీ మహంతి కల్యాణి కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ, రెండేళ్ల కిందటే సీఎం జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించారన్నారు. పార్లమెంట్‌లో తాజాగా మహిళాబిల్లు ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు.

హర్షణీయం

విజయనగరం టౌన్: భారత ప్రధాని నరేంద్రమోదీ మహిళా సాధికారతకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు సాధికార నారీ శక్తి వందన బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బొబ్బిలి శ్రీను అన్నారు. ఈ మేరకు కోట జంక్షన్ వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సాధికారతకు మోదీ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు శాంతి, భవిరెడ్డి శివప్రసాదరెడ్డి, మహిళా మోర్చా నాయకులు నీలాపు దేవి, నాగమల్లిక, పద్మ, సరస్వతి, శ్రీదేవి, కన్నాంబ, సౌమ్య, కృష్ణవేణి, సుధీర్, రామకృష్ణరాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.